# రామనవమి

[ కథ ]

## శ్రీ మాస్తి వేంకటేశయ్యంగారు

"ఇదిగో, ఇక్కడ సీతాదేవి కూర్చొన్నది. మరి ఇదిగో, ఇక్కడ ఆమెప్రక్కనసే మహానుభావుడు రాముడు నిలుచుకొన్నాడు. అల్లక్కడ నాలుగడుగుల అవతల అతని 'బంగారు' తమ్ముడు లక్ష్మణుడు నిలుచుకొన్నాడు."

రామనవమినాడు బోవనహళ్లి పొలిమేరలలో నడచుచు ఒక మహావృక్షముక్రింద కూర్చొన్న ఒక వృద్ధును చూడగంటిని.

పడగ రెత్తుచున్న పాముతీవిని తలయెత్తి అతడు నావంక దృష్టి సారించినాడు.

తలపైన పెద్ద రుమాలు. ముఖమునిండ నెరసిన వెంట్రుకలు. రత్నాలవలె కాంతులీనుచున్న కన్నులు. తీర్చిదిద్దిన ముత్యాల కోవవలె నున్న సన్నని పలువరుస. ముసలివాడు నిజముగా మురిపెము చిమ్ముచున్నాడు.

అతనితో మాట్లాడవలె ననిపించి నేనై నేనందుకొంటిని: "ఆర్యా, మీదర్శన మబ్బినందుకు చాల సంతోషముగా నున్నది." జీవికి జీవికి మధ్యనున్న ఏదో ఒక అనిర్వచనీయమైన బంధము అపరిచితులతో కూడ ఈరీతిని మాటలుపెట్టుకొనుటకు మనలను ప్రేరేపించుచుండును.

నామాటలకు ఆయనకూడ ఆనందించినాడు. "నమస్కారము నమస్కారము ఆర్యవర్యులకు. ఎక్కడికి పయనము?" అన్నాడు. అని, నానడకను అప్పటికి అరికట్టివేసినాడు.

పరస్పర నమస్కారములు, మర్యాదలు అయిన తరువాత, తాను కూర్చొనియున్న ఆ చోటియొక్క గొప్పదనమును తెలుపుటకై ఆ వృద్ధు ఈక్రింది పురాణ కథ చెప్ప ప్రారంభించినాడు:

"మహానుభావుడు శ్రీరాముడు తన అరణ్యవాసములో ఒక దినము ఇక్కడ గడపినట్లు చెప్పుకొందురు. ఆయన వెంట ఆయన పిన్నప్రియురాలు సీతాదేవి కూడ ఉన్నది.

"వారి వెంట వారి పరిచారకుడుగా లక్ష్మణుడు. శతాబ్దముల వెనుక శతాబ్దములు నమ్మకేర్చిన మా ఊరి పెద్దలు ఇట్లని చెప్పినారు.

"తెల్లవారు ఝామున అదెక్కడ బయలుదేరినారోగాని మిట్టమధ్యాహ్నము వేళకు ఇక్కడికి చేరుకొన్నారు. పైన మధ్యాహ్నసూర్యుడు మటమటలాడుచు తలలు మాడ్చివేయుచున్నాడు.

"ఈచెట్టుక్రిందికి చేరుసరికి ఆ దేవి అలసిసొలసి సొమ్మసిల్లినది. 'ఏమి ఎండరా బాబూ!' అని నిట్టూర్చినది. ఆ నిట్టూర్పులో కమ్మని పరిమళము గుబాళించి ఆ వాతావరణమునంతను కమ్మివేసినది.

"ఆకాశభిత్తికపైయంచుల కెగబ్రాకుచు, కాళ్లకు రెక్కలు కట్టుకొని, సర్వజిద్వైభవముతో, రెక్కలు విరవిచ్చుకొని ఠీవిగా ఎగురు గరుడపక్షివలె సూర్యుడు నడిమింటి కెగిరినాడు.

"సువిదితమైన అతని ఆ పరాక్రమక్రమమునకు కొండలు, బండలే ఓటమి నొప్పుకొని అలసట చెందిన వనగా, కుసుమకోమలియైన సీతాదేవి అంతకంటె వేరేమి చేయగలదు?

— "రామరాజు తన రాణి యున్న వైఖరి గమనించినాడు. మిక్కిలి సంకటపడినాడు. 'ఏమీ దైవవిలాసము! ఏమి దురదృష్టము, ప్రాణుల నింత అలయించుచున్నది! విదేహరాజుకూతురు, దశరథచక్రవర్తి కోడలు—ఆమెకా ఈ కనాకష్టజీవితము! ఆమె ఈ బాధలకు అసలు తాళగలదా అని!'

"ఆయనకు తోడునీడగా ఆయన వెనువెంటనే ఉండిపోవలెనన్న తన కోరికకు ఆమె 'విధాయకధర్మ' మన్న పేరు పెట్టినది. ఆయనయెడల తనకు గల ప్రేమ ఫలముగా ఆయమ ఇప్పుడీబాధల నన్నిటిని అనుభవించుచున్నది.

"ఆమె పడు పాట్లు తలపునకు రాగానే శ్రీరాముడు కలతపడిపోయి, గుబురుటాకులతో నిండి గుప్పుమని నీడ నిచ్చుచున్న ఈ మహావృక్షము నొకమారు వీక్షించి, స్త్రీజాతికి గల శక్తిసామర్థ్యముల హద్దులనుగూడ ఒకింత తలపోసి, 'ఈ చెట్టునీడను కూర్చొని కాస్త సేదదేరు'మని ఆయమను కోరినాడు.

"ఇదిగో ఇక్కడ సీతాదేవి కూర్చొన్నది. మరి ఇదిగో ఇక్కడ ఆమెప్రక్కనే మహానుభావుడు రాముడు నిలుచుకొన్నాడు. అల్లక్కడ నాలుగడుగుల అవతల అతని 'బంగారు' తమ్ముడు లక్ష్మణుడు నిలుచుకొన్నాడు."

ఇదంతయు చెప్పుటలో ఆ పల్లెపెద్ద ఎంతెంతో సంస్కృతము గుప్పించినాడు. అది చూచి, ఎక్కడ నేర్చుకొన్నాడురా ఇతడింత సంస్కృతమని నే నాశ్చర్యపోతిని. ఉండబట్టలేక అడిగివేసితిని కూడ— "అయ్యా, తమ రీ సంస్కృతము నెక్కడ నేర్చుకొంటి"రని. నే నా ప్రశ్న వేసినందుకు తన సంతోషము నొకింత కండ్లలో కనబరచుచు ఆ వృద్ధు ఇట్లన్నాడు: "ఆ! నాకు తెలిసిన సంస్కృత మేపాటిదిలెండు. మా ఆచార్యులవారి పాండిత్యమను గానుగ మాను వలయముతిరుగుచుతిరుగుచు శాస్త్రములనెడు చెరకుగడలను నలచుచుండగా, దానియొక్క రుచిరియెరిగిన నేను ఆయనప్రక్కనే నిలుచుకొని, అలవోకగా నాచేత వచ్చిపడిన ఆ చిలకరింపులను నాకుచు వచ్చితిని. నాపాండిత్య మదేమి అంత పెద్ద కొండగాదు. ఆ ఇక్షుసారముయొక్క కొన్ని వడకలు (తునకలు) మాత్రమే.

"పురుషసింహుడైన శ్రీరాముడు చెంత నిలుచుకొనియుండగా, సీతాదేవి యిల్లిక్కడ కూర్చుని 'రామా! ఈ నీడ ఎంత హాయిగా ఉన్నది!' అన్నది. అయ్యగారూ! ఆమెపెదవులు పగడాలవలె లేత యెరుపు రంగులో నుండెను.

"చూచినారా, అయ్యగారూ, ఈ పండుగపూట బొత్తిగా గాలియే లేకున్నది. తూర్పుగాలి విసురు ఆగిపోయినది. పడమటిగాలి యింకను రాలేదు.

"బహుశా పడమటి కొండలు గాలుల నన్నిటిని కూడగట్టి ఏదో ఒక విడుపుదినమునకై నిలిపివేసుకొన్నవేమో! లేదేని, ఇంత నిస్తబ్ధముగా నున్నదేల? గరిక పోచ అల్లాడదేల?

"ఆరీతిని పోగుచేసిన వాయువులలో ఒక్క పిసరు ఆ కొండకోనలనుండి దాటి వచ్చి వీచిన చాలును, ఈ రోజు నిజముగా ఒక పండుగరోజయి పోగలదు.

"ఆ దేవి సొమ్మసిల్లి ఇక్కడకూర్చొనియుండగా, ఆమెదర్శనము చేసుకొని ఆమెఆశీస్సులు పడయుటకో అన్నట్లు ఒక చిన్నగాలితెర పడమటినుండి వీచుకొని వచ్చినది.

"చుట్టును కలయదిరిగి ఆమెకోమలదేహమును తాకినది. ఆకులతో ఆడుకొని ఏదో గుసగుసలాడినది. ఎట్లో ఒకట్లు అలసట పోద్రోలి హృదయముల కుపశాంతి నిచ్చినది.

"అలసటనుండి తేరుకొని సీతాదేవి చుట్టును కలయజూచినది. ఆహాహా! ఎంత అందముగా ఉన్నదా వనభూమి! భూవలయమంతయు ఆనందముతో దొప్పదోగి సర్వేసర్వత్ర కుసుమించిన చందముగా నున్నది! వసంతాగమము ప్రకృతికాంతమోముపై తెచ్చిపెట్టిన ఆ చిరునగవు అదెంత ముగ్ధమోహనముగా నున్నది!

"చుట్టును పైరుపచ్చల సంతానము; రాచ ఠీవితో ఒప్పుచున్న చెట్టుచేమల వితానము! ఏమికై యుండునో విశేషము? ఇక్కడ సమావేశము కమ్మని వానిని పిలిచి పీటలువేసిన దెవరో?

"రంగమంతట నలముకొన్న ఆ ప్రకృతిసౌందర్యమును సీతాదేవి చూచినది. చూచి, అన్నది— 'రామా! ఈప్రదేశ మెంత మనోహరముగా నున్నది! అంతకంటె మనోహర మైనది మరేదైన నుండునా అని!'

"శ్రుతికి అపశ్రుతిగా మాట్లాడ నిష్టము లేక 'ఆహా! ఉండదు'అని అందుకొన్నాడుగాని, సరిగా నంతకుముందే తన ప్రియురాలు మగ్నమై యుండిన ఆ ఉద్విగ్నావస్థ మనసులో నింకను అల్లేఆడుచుండినందున మరి మాటలను పెంచలేకపోయినాడు.

"తన ప్రియుడాడిన ఆ రెండనగా రెండుమాటలు రాణి సీతను తృప్తిపరచలేకపోయినవి. ఆయనమూన

ముద్రను భేదించి ఆకాంక్షతను తీర్చుకొనుటకును, ఆయన నంతగా కలవరపెట్టుచున్నట్లు తనకు ప్రత్యక్షముగా కనిపించుచున్న అదేదో యోచననుండి ఆయనను తప్పించుటకును తన మాటల నింకను సాగింపబూనినది. 'ఆరణ్యక జీవితములోని కష్టముల నెంత యిదిగా వర్ణించితివయ్యా రామా! నేనును నీ వెంట వత్తు నన్నప్పుడు నా ఉద్దేశ్యమును అదెంత యిదిగా ప్రతిఘటించితివయ్యా! కాదుగూడ దని పట్టుపట్టి నేను నీవెంట రాక నేయుండినచో నే నీ యడవుల అతిలోకసౌందర్యమును చూచియుందునా చెప్పుము. చూచుచు చూచుచు ఇట్లే పదియేండ్లపాటు ఇతరచింత లేక ఉండిపోవుదమా అనిపించునంత నిర్భరమైయున్నదే ఈ రామణీయకము! ఆహా! నాకన్నుల కెంత విందుగా నున్న దిప్పుడు! అడవివెంట అడవి చూచుచు అందులోని ఆ అందమును, చందమును గమనించుచుండగా నా కె ట్లనిపించుచున్నదో తెలియునా? భూమిమీద కాక నే నెక్కడో స్వర్గములోని నందనవనములో తిరుగుచున్నట్లున్నది సుమా! ఏదో నాయందు దయదలచి నన్ను తీసికొనివచ్చితివి; నే నిదంతయు చూడగలిగితిని. అందువల్ల సరిపోయెకాని నీవు నన్ను తీసుకొనియే రాకుండినచో నాకీ మహాభాగ్యము లేకయే పోయెడిది కదా! మిట్టమధ్యాహ్నము వేళ చల్లని చెట్టునీడలలో కూర్చొని ఆనందము ననుభవించు ఈ అదృష్టము అంతఃపురవాసులకు లేదుకదా! మధ్యందినమున చెట్ల క్రింద నడచుట రాచఠీవికి సంగతము కాదుగదా! అడవులలో రోజుకురోజంతయు తిరిగినను హాయిగానే ఉండునన్న సంగతి యెరిగియుంటినిగాని ఇంతహాయిగా ఉండు నని మాత్రము నే నెరుగను. భావనను మించిపోయినది యథార్థము. ఆ అయోధ్యలో నేమున్నది! ప్రతినిత్యము చూచినను అదే సూర్యుడే, అదే చంద్రుడే! వారి కెందుకు తోచదో!'

"ఈ మాటలలో సీతాదేవి సగము తన హృదయములోని నిజమైన ఆనందమును వెళ్లగక్కినది. మరి సగము తన అధినాథుడు తన నిమిత్తముగా విషణ్ణుడు కారాదన్న ఆశను వ్యక్తీకరించినది.

"అవును, ఈ సంగతి రాముడును ఎరుగును. తనపట్ల ఆయమవిధివిధానములలో అనునిత్యము తనకు గోచరించుచుండిన ఆ స్నేహసంపత్తిని ఆయన ఆశ్చర్యముతో తిలకించుచుండినవాడే. ఆ స్నేహముయొక్క గాంభీర్యమును ఆయన ఆరోజు తిరిగి చూడగలిగెను. చూచి, ఎప్పటియట్లనే ఆశ్చర్యముపడెను.

"అడవుల అందచందముల యీ ముచ్చటింపులో ఆనాడు వా రేమనిరో నేటికి నది నిజముగా నంతే యని నే నందును. నగరములలోని జీవితము మన ప్రజల జీవితానందమును ధ్వంసధూళి చేసివేసినది. ఆ కట్టడకలాపములను నగరము లను పేరుతో పిలుచుటకన్న 'నగరము'లని పిలుచుటయే యుక్తముగా నుండును. మనిషికి తల దాచుకొనుటకు ఇల్లు కావలెను, నిజమే. కాని దానికితోడు వానికి ఆరుబయలుకూడ అవసరమే. సదా సర్వకాలము నాలుగుగోడలమధ్యనే పడియుండినచో మరి వారు ఆరుబయటియొక్క సౌభాగ్యమును తెలుసుకొనున దెట్లు?

"ఆ సీతారాములు ఇక్కడ కూర్చొని యిట్లు మాట్లాడుకొనుచుండగా బంగారునాలుక మైనా ఒకటి ఈ చెట్టుమీదికి ఎగిరివచ్చి, పైకొమ్మమీద ఒకదానిమీద కూర్చొని, గొంతెత్తి పాటకు లంకించుకొని, చుట్టుపట్టుప్రదేశమునంతను తన్మయముగా ఊపివేసినది. ఆర్యా, ఒక పక్షి తనమీద వచ్చి వాలి పాట పాడినప్పుడే చెట్టు అంతటి ఆనందము పొందనేర్చును. మీరు వచ్చి నాతో మాటలకు పెట్టుకోకపోయియే యుండినచో నాకు మీతోడి యీ సంభాషణ యెట్లబ్బియుండును?

"అడవులలో మనకు వినబడు అనేకశబ్దములలో మైనాశబ్దమే మధురతమము. అట్లని, ప్రపంచమును నింపివేయుచున్న మిగతా శబ్దములలో మాధుర్యము లోపించిన దని చెప్పుట కాదు. భగవంతుని యీ క్రీడామందిరములోని శబ్దములకును, అభిరుచులకును అం తెక్కడ? మనిషన్నవాడు తాను చూడనేర్చిన రంగులనన్నింటిని ఎక్కడనైన చిత్రింపగలడా? మన చెవులకు సోకు శబ్దములన్నియు మధురములే. ఏ మందురా? ఆ అన్నింటిలోని 'కంఠము' మనలను భగవంతునివైపునకు పిలుచు ఒక్క పిలుపేకదా! అది ఒకప్పు డిట్లును శబ్దించవచ్చును, ఒకప్పుడు అట్లును శబ్దించవచ్చును.

"వాడు ఎక్కడనో మన మెరుగనిచోట ఉన్నాడు. వానినుండి అదిగో, అదిగో, పిలుపు వచ్చుచున్నది. ఎవ రది? ఒక పక్షి. పిలుచుచున్న వ్యక్తి కనబడదు. 'ఏం!' 'హి!' 'హీ!' ఇదంతయు వాని క్రీడావిలాసము.

"వాడు మనలో నున్నాడని కొంద రందురు. ఉండవచ్చును; ఎందు కుండగూడదు? కాని, అప

సిద్ధాంతములుచేయుట పాడిగాదు. మన ప్రభువు చిక్కువాడేకాని పట్టుబడువాడు కాడు."

"నేను బీజాపురములో ఒక గుమ్మటమునుగురించి విన్నాను. నీవు ఈ కొనను కూర్చొమ్ము; ఒక స్నేహితుడు అవతలికొనలో కూర్చొనిమ్ము. అతడు గోడకేసి గుసగుస లాడును. ఇవతల నీవు ఈ గోడనుండి ఆ గుసగుసలను విందువు. మరి ఆ రెంటిమధ్య శూన్య కాశమే ఉన్నది.

"ఒక నీళ్ళులేని బావి—నీ తల తిరుగునంత విశాల మైనది. నీ పిదలేవు. ఎందువల్ల ? అది వట్టి ఖాళీగనుక. నీ స్నేహితుడు నీ చెంత లేడు; నీ వతనిని తాకలేవు. నీ వతనిని చూడగలవు; అందుకే నీవు కృతజ్ఞుడవై యున్నావు.

"గుసగుసను నీవు నీ ప్రక్కనున్న గోడనుండి విందువు. అది అక్కడనే జన్మ యెత్తినదా ? అట్లు తలచుట యెంత అజ్ఞానము? వాడు లోపల ఉన్నాడా? వాడు బయట ఉన్నాడా ? ప్రశ్నకు తుది యెక్కడ? అలాగే; అలాకాదు; కాని, అలాగే.

"అక్కడి ఆ గుమ్మటములో నీవు నీ స్నేహితుని చూతువు; ఇక్కడి గుమ్మటములో మన మిత్రుడు మనకు కనబడకుండనే గుసగుస లాడును. అతనికొరకని మనము చుట్టును కలయజూతుము. మరి, తలపోతలో దారి తప్పుదుము.

"నే నేమి చెప్పుచుంటిని? ఆఁ. పక్షి పాట పాడుచు చుట్టుపట్టు ప్రదేశమునంతను ముగ్ధపరచుచుండెను. ఆ పాటకు మిక్కిలి ఆనందించినదై సీతాదేవి యిట్లనెను: 'మరొక గొంతు ఇంత మధురముగా నుండునా రామా? అది మధువుకన్న రుచ్యముగా నున్నది.'

"తన హృదయానందము నీ మాటలతో వెల్లడించుచున్న ప్రియురాలినిగూర్చి రాముడు తమాషాకిట్లన్నాడు: 'ఇంతకంటె మధురమైన ఒక గొంతును నే నెరుగుదును.'

"'ఏదా గొంతు? నే నెప్పుడైనను దానిని విన్నానా?' అని అడిగినది మా తల్లి—తన కంటె ఎంతో తెలిసిన భర్తనుండి అదేదో తెలిసికొందమన్న ఆశతో.

"'నీవు నన్ను రామా అని పిలుచునదే ఆ గొంతు. నాపాలికి అదియే ఎంతో మధురతరము!' అన్నాడు రామచంద్రుడు. తమాషాలోకూడ అతను తథ్యమునే మాటలాడును. నిజమునకు భార్యపట్ల రామచంద్రునికి గల భావావేశము వర్ణింపరానంత ప్రశంసనీయమైనది. జగజ్జనని అటువంటి వ్యక్తి; అత డామె నంతగా ప్రేమించినా డన్నచో ఆశ్చర్య మేమి?

"తన గొంతుక రామునిపాలికి నిజముగా మధురాతిమధుర మని సీతామాత నిష్కర్షగా ఎరుగును. కాని ఆయనను చూచి ఇంచుకంత నవ్వుదమన్న ఉబలాటము మాత్రము ఆయమకు వదలలేదు. తన ముఖ మాయనకేసి త్రిప్పి అరవిరిసిన పెదవులతో చిరునవ్వు చిందించుచు ఇట్లన్నది: 'ప్రతినిత్యము ఇటువంటి సంగతులే నాకు చెప్పుచుందువు. ఇటువంటి మాటలతో స్త్రీ యొక్క గర్వాభిమానములను మరింత రెచ్చగొట్టి పరిపోషించుట న్యాయమా, నీవే చెప్పుము.'

"రాణిమాటలను విన్నాడు రాముడు. చిరునవ్వు నవ్వినాడు. మారుమాట లేక మూకీభావము వహించి, ప్రియురాలి నెమ్మోముమీద ఉన్న ఆ విలువంపును కండ్లతోనే ఆస్వాదించుచు నిలుచకొన్నాడు.

"సరిగా ఆ సమయమునకు అది యేడాది తొలి శుక్లపక్షములోని తొమ్మిదవ దిన మనియు, రాముడు జన్మించిన దిన మనియు సీతాదేవికి చటున జ్ఞాపకము వచ్చినది. జ్ఞాపకము వచ్చి, వెంటనే ఆమె హడావడి పడుచు ఇట్లని అన్నది: 'అయ్యయ్యో! రామా! ఎంత పొరపాటు జరుగనై యుండినది! ఈదినము నీపుట్టిన రోజుపండుగ అన్న విషయమే పూర్తిగా మరచిపోతినే! నిన్ననగా నిన్ననే ఈ సంగతి మనసుకు తెచ్చిపెట్టుకొంటిని. కాని, నే డది నాస్మృతిపథము నుండి ఎట్లు జారినదో జారిపోయినది. నా మందబుద్ధిని నే నేమని చెప్పుదును!

"నేను మరచిపోతినే అనుకో, ఓయి లక్ష్మణా, మా జీవితములలోని మంచికంతకును బాధ్యుడవైన నీ వెట్లయ్య మరచితివి? నీవే యిట్లుపేక్షించినచో ఇక మా గతి యేమి? మంచిది, పోనిమ్ము, పుట్టినరోజు పండుగ ఇక్కడనే జరుపుదము. ఆ చెట్టుక్రింద నేను వంటచేసెదను. ఈ పరిసరములన్నియు చుట్టిచూచి, కూరలు, కాయలు, పండ్లు—నీ వేమేమి తేగలవో తెమ్ము. వెళ్ళు, తమ్ముడా, వెళ్ళి త్వరగా రా, వెళ్ళు.'

"ఏమి ఉత్సాహము! ఏమి ఆనందము! ఏమి హడావడి! ఆమెమాటలలోను, చేతలలోను అదెంత విన్నాణము! భర్త చెంత నున్నప్పుడు సీతాదేవి ప్రతి

మాటయు సరిక్రొత్తగా తీసిన తేనెవలె కమ్మగా నుండెను.

"వంటవార్పులలో తన సహచారిణికి తోడుపడవలెనని రాముడు తానుగావెళ్ళి సులువుగా మండునట్టి సన్నని ఎండిన పుల్లలను ఏరుకొని వచ్చి, తాను ప్రేమించునట్టివారికి దేవుడు సేవకుడుగా కూడ పనిచేయునన్న నిత్యసత్యమును ఖాయపరచెను.

"ఏమి, ఆ రోజువంటకము లేమని అడుగుచున్నావా? దానిఁగురించి మాట లెందుకులే. రాచవారైనంతమాత్రమున ఈ అడవిలో వారి కేమి పంచభక్ష్యపరమాన్నభోజన మబ్బునా? నగరములలో లభించు నాణెమైన వంటకములు ఇక్కడెట్లు దొరకును? ఏదో వంకాయలపులుసు వండుకొన్నారు. ఏవో అడవి కందమూలములతో కూర చేసుకొన్నారు. అడవిలోని ఏదో నీవారధాన్యముతో అన్నము చేసుకొన్నారు.

"అయ్యా, ఈ రీతిని ఆ రామజయంతినాడు సీతాదేవి—జనకరాజతనయ—స్వయముగా వంట వండి ఆయనకు పండుగచేసినది.

"అన్నతోపాటు తానును భోజనముచేసి మిగిలిన ఆహారపదార్థములను వదినెగారికి వడ్డించి లక్ష్మణుడు పెద్ద లిద్దరకు వారివారి చిత్తానుసారముగా ఊడిగము చేసెను.

"జీవితములోని ఎగుడుదిగుళ్లకు అతీతు లెవరు? భక్తు లనుకొను మాటలు నీవు వినియేయుందువు. 'జీవితములో శుక్లపక్షము, కృష్ణపక్షము కూడ ఒకటివెంటనొకటి ఉండనే ఉండును. కాబట్టి నీ మేలుకై మంచినంతను సంచితముచేసుకొమ్మ. చేసుకోవా, ఎందుకును కొరగాకుండ పతనమై పోవుదువు.'

"ఈ స్థలమునుండి వెళ్లిపోవునప్పుడు సీతాదేవి ఈ వృక్షమునకు దీవన లిడుచు ఇట్లన్నది: 'అవసరవేళలో నా కాశ్రయ మిచ్చిన ఓ సోదరీ, నీవు 'నిత్యకల్యాణము పచ్చతోరణము'గా కలకాలము పసిమితోను, పోడిమితోను విలసిల్లుదువుగాక! మా పండుగకు ఉదకముల నందించిన ఓ కూపమా, నీవు ఏనాటికిని ఎండిపోకుండ ఉందువుగాక!'

"కన్న బిడ్డ లిద్దరికి తల్లి యిడిన దీవనలవలె ఆమె ఆ చెట్టకును, నూతికిని ఇడిన దీవనలు వాని నింతవరకు సురక్షితముగా కాపాడుకొని వచ్చినవి. ఇది అదే వృక్షము. ఇవి అవే నీళ్ళు.

"ఇది అదే చెట్టని మే మనుచున్నాము. బుద్ధిమంతులు కాదందురు. మాటలు పెంచుకొన్నందువల్ల ప్రయోజన మేమి? ఒకవేళ ఇది అదే చెట్టు కాదే అనుకొండు. దాని బిడ్డ అయిఉండవచ్చును; లేదా బిడ్డబిడ్డ అయియుండవచ్చును.

"ఈ చెట్టు ఇక్కడ లేనప్పుడు చూచినవారు ఈ యూరిలో ఒక్కరుకూడ లేరు. ఏనాటినుండి ఇది ఇక్కడ ఉన్నదో, మన మెరుగుదుమా? మన కెరుకలేని సంగతులను గురించి మాట్లాడిన ప్రయోజన మేమి?

"ఈ చెట్టు ఆకులను ఎవరును కోయరు. ఇది ఏనాడును పూర్తిగా మోడైపోయినదికూడ లేదు. వసంత ఋతువులో దీని సౌభాగ్యమే సౌభాగ్యము!

"దీని జాతికి చేరిన చెట్లలోనే ఇంకొక చెట్టు నీడకు దీని కున్న విలువయు, బలుపును ఉండవు. దీని క్రింద కూర్చొని చూడుడని నేను సర్వేసమస్తప్రజకు చెప్పుచున్నాను. దీనికి సాటి మరి ఉండదు. నిజము, ముమ్మాటికి నిజము చెప్పుచున్నాను.

"తన భర్తయొక్క అలనాటి ఆ పండుగను జరిపిన ఈ ప్రదేశముమీద సీతాదేవికి మహా-మమకారము. కనుకనే ప్రతిరామజయంతికిని ఆమె ఇక్కడికి కొంతగాక కొంతసేపైనను వచ్చిపోవుచుండును. రాముడు, లక్ష్మణుడు, సీత ముగ్గురును వచ్చుచుందురు. వచ్చి, సంతోషముతో, ఈ ప్రదేశమందు కొంతసేపు తిరుగాడిపోవుచుందురు. మా యూరిలోని తాతలును, ముత్తాతలును అటువంటి సందర్భములలో ఆ యన్నదమ్ములను, ఆ యన్నులమిన్ననుగూడ చూచినారు. ఈ సంగతి మా యిండ్లలో తరతరాలుగా చెప్పుకొనుచున్నదే.

"మంచివారైనవారికి వారు కనబడుచుందురని చెప్పగా విన్నాను. అది కాదు, వారి దయకు పాత్రులైనవా రెవరో అట్టివారికి వారు కనబడుదురని నే నందును. మనుష్యుల కంత మహత్వము నిచ్చి, భగవంతుని సౌమ్యత్వమునకు హద్దు లేర్పరచుట యెందుకు?

"నాకును వారిని చూచు భాగ్య మేనాడైనను అబ్బకపోవునా అన్న ఆశతో యువావస్థనుండి ఇప్పటివరకు ప్రతి శ్రీరామనవమికిని ఇక్కడికి వచ్చి, పడిగాపులు పడుచునే యున్నాను. నేటికి నేడు గూడ

వారిని కన్నులారా చూడగల నన్న ఆశతోనే ఇక్కడికి వచ్చి, ఈ చెట్టుకు, ఆ బావికి చెంతను కూర్చున్నాను. ఒక్క రామనవమికూడ నే నిక్కడకు రాకుండ వదలిపెట్టినది లేదు.

"అసలు సీతారాములు కనబడుదురా అని అనేకులకు మీమాంస. నమ్మువారు కొందరు, నమ్మనివారు కొందరు. నామట్టుకు నేను నా పెద్దలమాట నంగీకరించి నమ్మనే నమ్ముదును. వారు కనబడువారే అయితే మనము వారిని చూడకలదా అని! విశ్వాసము లేనిచో ఆ పని యెట్లు చేయగలము?

"మీకు గాలి కనబడదు. కాని, చేతిని అంతరిక్షములో కొంచెము ఆడించిచూడుడు. గాలి మీ శరీరమునకు తాకి 'ఇదిగో నే నున్నా'నని అనును. భగవద్విషయములోకూడ అంతే. మామూలు తరహాగా ఆయన మనకు కనబడువాడు కాడు. అత డప్రమేయుడు. కాని మీ మనస్సును గనుక మీరు ఆయనవైపు ప్రసరింపజేసితిరా, ఆయన మీ ఆత్మను తాకును. ఆ భాగ్య మబ్బినవారు తమ యెట్టయెదుట భగవంతుడు నడచుచుండుటను స్పష్టముగా చూడగలరు.

"ఆర్యా, మన యీ జీవితములో, అతురాలా మన సమక్షములోనే స్వర్గము, నరకము రెండును ఒకటిగా బద్ధమైనవి. మన మన కర్మానురూపముగా మనము వానిలో దేనికో ఒకదానికి పాత్రుల మగుచుందుము. వానిని రెంటిని విడదీయలేము. ఆ రెంటిని ఒకదానిలో చూచు నేర్పు, మహోశయా, మానవులు నేర్చుకోవలసియున్నది.

"సీత, రాముడు, లక్ష్మణుడు—ముగ్గురును కలిసి నాయెదుట నడచుచుండగా నేను చూడగలనా? నా హృదయాధినాథుడైన ఆ భగవంతుని నే నెప్పుడు చూడగందును?

"చూడ నోచుకొంటిమేని మహామంచిదే. కాని చూచితీరవలె నని పట్టుపట్టుటమాత్రము తప్పు. మనము చూడజాలకపోయినను మునిగిపోవునది లేదు. ఏకాంతమున కూర్చొని, ప్రశాంతముగా వారినిగూర్చి తలపోయుదము. అదికూడ ఎంతో మంచిదే.

"రామా! రఘురామా! లక్ష్మీరమణా! నన్ను దయచూడవయ్యా! నాకు ప్రత్యక్షముగా సాక్షాత్కరించి నాయెదుట నిలువవయ్యా!"

ఆ వృద్ధుని మాటలు వినుచు వినుచునే నే నటువైపు ఆ లోయలో నున్న ఒక చెట్టుకేసి చూచితిని.

అక్కడ ఇద్దరు వ్యక్తులు. ఒక యువకుడు నిలుచుకొనియు, ఆయనకు చేరువనే ఒక యువతి కూర్చొనియు ఉండుట గాంచితిని.

ఇద్దరును అప్పుడప్పుడే యౌవనములో పడినారు. యువతి నవ్వుచు ఏమో చెప్పుచున్నది. యువకుడు ఆమెమాటలకు చెవు లొగ్గుటయే లేదు. వట్టి కన్నులమయ మైపోయినాడు.

"వారు సీతారాములై యుందురా?" అని నా మనస్సు ప్రశ్నించినది. ఆ తలపునకు హృదయము గంతులువేసినది. వారే ఎందుకై యుండగూడదు? ఇన్నాళ్ళుగా కాచుకొని కూర్చున్న ఈ వృద్ధుని కోరికను తీర్చుటకు వారు వచ్చియుండగూడదా?

ఆ యువతి గుడ్డల నుతుకుచున్నదా? ఆమె చేతులలోని గాజులు గలగల లాడుచున్నవి. మరి ఆ యువకుడు ఆమెతో నేమో చెప్పుచున్నాడే, అదేమి? అత డేమో మాట్లాడుచున్నా డన్న సంగతి విస్పష్టముగా కనిపించుచున్నది.

చెట్టుదగ్గరి ఆ యువదంపతులను నేను చూచుచుండుట కనిపట్టి, ఆ వృద్ధుడు తానును ఆ వైపు పరికించి యిట్లనెను: "వారు నా కుమారుడు, కోడలును. ఇంటికి రమ్మని నన్ను పిలువ వచ్చినారు. ప్రొద్దున ఇంటినుండి బయలుదేరినప్పుడు పూజావేళ కాగానే వచ్చి నాతో చెప్పుమని చెప్పి వచ్చియుంటిని. ఆ ప్రకారముగా నన్ను పిలువ వచ్చినారు వారు. ఒక పని నెరవేర్చినట్లును అయినది; సాహచర్యముగా కొంత కాలక్షేపము చేసినట్లును అయినది! జనముమీద జనముతో నిండిన యింటిలో లేబ్రాయములో నున్న యువతి తాను చెప్ప దలచుకొన్న దంతయు తన భర్తతో ఎట్లు చెప్పుకోగలదు? కాగా, తనతో బైటికి రమ్మని ఆమె సైగలు చేయును. చేసి, అతనిని ఆ చెట్టు క్రిందికో, బావి చెంతకో తీసుకొనిపోవును.

"తాళ్లు పేనుచునో, లేదా బట్ట లుతుకుచునో ఏదో ఒక పనిమీద నున్నట్లు కనబడుచు, వా రుభయులును కలిసి నవ్వుచు, మాటలాడుకొనుచు, పరస్పర ప్రేమానురాగములను వెళ్ళబుచ్చుచు కొంత కాలక్షేపము చేయుదురు.

"'తల్లీ యారవ్వా, ఒక్క క్షణ మిట్లు రావమ్మా! అబ్బాయి రామా, ఒక నిమిష మిట్లు రావోయి! పట్టణ మునుండి వచ్చిన ఈ అయ్యగారు ఇదిగో మిమ్ములను గురించి భోగట్టా అడుగుచున్నారు. రండు. ఆయనకు నమస్కారము చేసి, ఆయన ఆశీర్వాదములను పొందుడు. సత్పురుషుని సారవాక్కులు ఫలించి, మన వంశము వృద్ధిచెందనిండు.

"మాటలలో బుద్ధిమంతులైన మానవులు కొందరు ఇంటి కుమారుడు రాముడని, ప్రతి స్త్రీయు సీతయని చెప్పగా నేను విన్నాను. కాని ఈ సంగతి మనము వట్టిమాటలలో చెప్పిన చాలునా అని! ఇటువంటి తెలివిమంతుడు తన చెరకుగానుగను వెఱ్ఱి చెరకుతో నింపుచున్నాడు. ఇటువంటి వట్టి వెఱ్ఱిమాటలను రుబ్బినందువల్ల అదియేమిటి రసము నిచ్చును, ఏమిటి బెల్లము నిచ్చును? ఇతరుల ఇంతులను పేర్కొనుము. వీరి కనుబొమలు ఎగిరిపడును. వారి పాలికి ప్రతి స్త్రీయు సీత అయినప్పుడు మీరు కాకిబంగారునుండి సరములు సాగదీయవచ్చును.

"అతని యెదుట తిరుగులాడుచున్నది అక్షరాలా నిజముగా భగవంతుడే. కాని రాముని కన్న దశరథుడు అతనిలో తన కొడుకునే చూచినాడు కాని తన దేవునిని చూడలేదు. ఈ మాయకు అతీతుడైనవా డెవడు? తన కుమారునిలో భగవంతుని గుర్తించగల పరిజ్ఞానము అయోధ్యాధీశ్వరుడైన దశరథునికే లేకుండచేయబడినప్పుడు ఇక అది నాకు దయతలచబడునా అని! అవి వట్టి మాటలు. కొడుకులో భగవంతుని చూచుటకు, ముందు, ఎవరైనను సరే ఆత్మనుండి మమకారమును లాగివేయవలసియుండును. ఆ సమదర్శనము లభించుటకు మనిషి మోక్షావస్థకు చేరుకొని యుండవలెను. ప్రతి ఇసుకరేణువులోను, సృష్టిలో ప్రతికణమునందును రాము డంతర్గతుడై యున్నాడు. మాయ ముసుగువలె అతనిని కప్పియున్నది. అతనికి బుద్ధిపుట్టినప్పుడు అతడా తెరను ప్రక్కకు తొలగద్రోసి తనను మనకు ప్రత్యక్షీకరింపజేయును. మాయ అన్నది కేవలము ఒక ముసుగే కాబట్టి ఇటువంటి అనుగ్రహము ఆయన సహజకారుణ్యముతో మనలో ఎవరిపట్లనైనను చూపవచ్చును. మానసికనేత్రముమీద కప్పియున్న 'నేను, నాది' అన్న పొరను తప్పించుట మనిషి కంత సులభసాధ్యమైన పని కాదు."

అని ఈ రీతిగా ఆయన మాట్లాడుచుండగా, ఆ పిలుపు నందుకొని వా రిద్దరు కలిసి మాకేసి నడచి వచ్చిరి. యువతీయువకు లిద్దరు పరస్పరసాహచర్యముతో నడుచుచుండగా చూచుట అది ఒక నిత్యదర్శనీయమైన దృశ్యము.

మే మున్నయెడకు వచ్చి చేరగానే వారు నాకేసి చేతులు జోడించిరి. అప్పుడు నేను వారిని చూచి "భగవంతుడు మీకు సుఖసంతోషముల నిచ్చుగాక!"అని దీవించితిని. యువకుడు తండ్రికి చేరువగా చేరుకొనెను. యువతి అతని వెనుక నిలుచుకొనెను.

ఆ సన్నివేశమునుగురించి ఆ వృద్ధుని అభిప్రాయ మేమైయుండినను ఉండనిండు. నామనస్సులో మట్టుకు ఆ క్షణమున మానలుగురితో కూడిన ఒక చిత్రము రూపుదాల్చెను.

వారు ముగ్గురును దశరథుడు, రాముడు, సీతయునైరి. మరి నేను ఆయమతండ్రి జనకుడనైతిని. ఆ చిత్రము ఎంతో విస్పష్టముగా నాకు పొడగట్టినది. అది నా మనస్సులో నా ఆఖరు రోజువరకు అట్లే నిలిచియుండగలదు.

పిమ్మట నేనాయనతో ఇట్లంటిని: "మహాశయా, మీరు నాకీ పండుగునాడు బహుమంచికథను చెప్పితిరి. మిమ్ములను, మీ విధివిధానములను చూడగలుగుటచేత నేనెంతో హాయి పొందితిని. మరి నాకు సెలవిత్తురా?" ఈమాటలతో నేను బయలుదేరుటకు సిద్ధమైతిని. వృద్ధుడు లేచి నిలుచుకొని, నమస్కారపద్ధతిగా రెండు చేతులను తన ముఖమున కెదురుగా ఎత్తి జోడించెను. జోడించి ఇట్లనెను: "మీరుకూడ ఈ పండుగునాడు సాక్షాత్తు శ్రీరాములవలెనే నావద్దకు దయచేసినారు. భగవంతుడు మీపాల నుండు గాక! మరల నెప్పుడైన ఈవైపు దయచేసి మమ్ముల ననుగ్రహింపుడు."

"అట్లే కాని"మ్మని మనసులోనే అనుకొని, అవసరమైనప్పుడు విచారించుటకు ఉపయోగించును గదా అని, నే నావృద్ధును ఆయనపే రేమో అడిగితిని.

ఆ ప్రశ్న కతడు జవాబు చెప్పడు. "ఏమి పేరని నేను చెప్పకొందును? పేరు లేదు, పెంపు లేదు. కీర్తి లేదు, ప్రతిష్ఠ లేదు. జీవితము తన్నితగలవేసిన ఆరడుగుల కీటకము మనిషి." అని మాత్ర మన్నాడు.

"అదంతయు సరేనండీ. ఆ కీటకములలో అధమాధమకీటకమునకుగూడ తల్లి ఏదో ఒక పేరు పెట్టియుండు నన్న సంగతి మీ రెరుగనిదా చెప్పుడు." అని నే నంటిని.

తన పే రుచ్చరించుటకు ఏమాత్రమును ఇష్టము లేకుండనే, నా బలవంతముమీద చివర కెట్లో చెప్పినాడు. "అడ్డాలలో బిడ్డగా నున్నప్పుడు నన్ను నా తల్లి జవారా అని పిలిచెడిది. ఆ పేరుతో పిలుచుచునే నన్ను పెంచి పెద్దచేసినది. నే నింతవాడనైతిని. ఆ పేరుతో పిలుచుచునే ఈ ప్రపంచమునుండి మరుగుపడి పోయినది. ఆ పేరుతో, అంతటి వాత్సల్యసౌకుమార్యములతో ఆ తల్లి పిలిచిన ఆ పిలుపే ఎంతో అరిష్టమునకు, జ్వరములో నాలుకమీది ముండ్లవలె లేచు ఆత్మప్రేమకు కారణ మైనది. దానినే మానవులు జీవిత మనుచున్నారు."

"తాతగారూ, మీ విషయములో మాత్ర మట్లు కాదు. మీరు సత్యమార్గముననే చరించినారు. ఇప్పటివరకు మిమ్ములను భగవంతుడు సన్మార్గముననే తీసుకొనివచ్చినాడు. ఇకమీదకూడ మిమ్ములను వదలిపెట్టడు." అని చెప్పి నేను వారి సెలవు తిరిగి తీసుకొని ఇంటికి వచ్చివేసితిని. ఆ వృద్ధునియొక్కయు, ఆయనవిధివిధానములయొక్కయు మెచ్చుకోలులో నాహృదయము లీన మైపోయినది.

ఇంటికి చేరుకొని, అక్కడ జరిగిన ఆ సంగతి సందర్భము లన్నిటిని ఇంటివారి కందరికిని చెప్పితిని. ఆ కథ విని, ఎంతో జాలితో నాభార్య "భగవంతుడా తాతపట్ల దయదలచుగాక!" అనెను. "యీరవ్వను చూడవలెనని నాకు చాల ఆశగా ఉన్న"దని నాకూతురనెను. "నీవు తలపోయు కోరికల నన్నిటిని ఎవడైన అసలు లెక్కపెట్టనేర్చునా ?" అని నాఅల్లుడు కూతురిని హెచ్చరించెను.

ఆ ఉదయము జరిగిన ఈసంఘటనపునస్మరణము నాటి పండుగకు ఎన్నడును లేని తేజస్సు తెచ్చినది. అనిర్వచనీయమైన ఆనందము నాజీవిని లోపల, బయట కూడ వెలుగువెల్లువతో ముంచినది.

అదిగో ఆ వృద్ధు నాయెదుట స్పష్టముగా కనిపించుచున్నాడు. "అందరును చల్లగా నున్నట్లే నమ్ముచున్నాను. చూడు, నాజీవిత మెంత సంపన్నమై యున్నదో"అనుచున్నాడు.

లోకమాత లోలోపలనే మాటలాడుచున్నట్లు "నేను ఈరవ్వను. నేను కూతురును. నేను నిత్యమైన సీతను" అన్నమాటలు నా హృదయములో స్పష్టముగా వినిపించుచున్నవి.

ఆ వృద్ధుమనస్సులో నున్న పద్ధతిగా ఆ మాతయొక్క దర్శనము నేను చేయలేదు. ఆ గొంతు నా చెవులతో వినలేదు. కదలుచున్న పెదిమలను నా కండ్లతో చూడను లేదు.

సత్యము జ్ఞానక్షేత్రమును చేరినది. అది భావతలమును తాకినది. భవిష్యత్తులో ఏనాడో ఒకనాడు, ఈ చిన్న ఆత్మబంధము సళ్లజేసినపుడు అది నిస్సందేహముగా ఆత్మను తాకితీరును.

సీతారాములు కనబడుట యన్నది ఎక్కడనైన కద్దా అని అడుగువారు వారిపద్ధతిని వారు బుద్ధిమంతులే అని నే నొప్పుకొందును. అయితే, వారిజ్ఞానము పైపెంకును రక్షించును కాని, సత్యసారము నది చంపివేయును.

జీవితమార్గమును వెలిగించున దేదో దానినే నేను సత్య మనుచున్నాను. అట్లు చేయలేనిది సత్యము కాదు; సత్యముయొక్క వట్టి ఆభాస.

ఆ పల్లెటూరి వృద్ధుయొక్క హృదయములో వసించుచున్న విశ్వాసము నా హృదయములో ఉబుకుట లేదు. నాకు దత్తమైన ఆ విశ్వాసము వీరికి నిరిష్టముకాదు. భగవంతుని సృష్టిలో ముఖములందువలెనే మనస్సులందు సత్యవిషయమున ఒకడు ఇంకొకనిని పోలడు.

నా పల్లెటూరి వృద్ధుయొక్క ఆత్మ ఆయనకు ప్రాప్తమైన ఆ విశ్వాసములోని ఆ లాలిత్యమును పోషించి పెంచుకొన్నది. మీ జీవిలోని మాయావరణముకూడ మీరు మీ హృదయము నప్పగించుచున్న ఆ సత్యముచేత తొలగిపోవుగాక!

నే నింకను ముందుకు పోవుదును : ప్రపంచముయొక్క దౌర్భాగ్యమయిన చరిత్ర అటువంటిది. అది ఈనాడు సీతారాముల పేర్లను కలిసి సంపూర్ణముగా పూజింపలేకున్నది.

కాని, పేర్లమట్టుకు పేర్లతో అది ఏమి చేసుకొన్నను సరే, అది వాని నంగీకరించినను నిరాకరించినను సరే, తాము రూపించుకొన్న ఆ సత్యమును తమ మనస్సులలో నాటుటకు ప్రపంచము వెనుదీయకుండునుగాక!

దాని బీజము మొలకెత్తి, పెరిగి పెద్దదై ఒక మహోన్నతవృక్ష మగుగాక! దాని నీడలో అందరికిని మనశ్శాంతి లభించి అందరును శాశ్వతాభ్యుదయ సంపన్ను లవుదురుగాక ! ('త్రివేణి'నుండి)